ఆటోను కారు ఢీకొనడంతో విద్యార్థి మృతి

మరో ముగ్గురు విద్యార్థులు, ప్రయాణికురాలికి గాయాలు

దుమ్ముగూడెం, ఆగస్టు 10 : ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఓ ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతిచెందగా.. మరికొందరికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఏపీ రాష్ట్రం ఎటపాక మండలం తునికిచెరువు వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దుమ్ముగూడెం మండలం కొత్తపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న తూరుబాక, బండారుగూడెం గ్రామాలకు చెందిన నలుగురు విద్యార్థులు శని, ఆదివారం సెలవు కావడంతో హాస్టల్ వార్డెన్, సిబ్బందికి తెలియకుండా ప్యాసింజర్ ఆటో ఎక్కి వారి ఇళ్లకు వెళ్తున్నారు. ఈ క్రమంలో తునికిచెరువు వద్దకు రాగానే అతివేగంగా ఎదురుగా వస్తున్న కారు ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థి కుంజా దీపక్(13)కు తీవ్ర గాయాలుకాగా.. కాటబోయిన కార్తీక్, కాటబోయిన జశ్వంత్, కుంజా అనిల్‌లు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే దీపక్‌ను మరో ఆటోలో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. మిగిలిన విద్యార్థులు స్వల్ప గాయాలు కావడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. అలాగే అదే ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళ చేతికి తీవ్ర గాయమైంది. ఈ మేరకు అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిర్వహించి దీపక్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇదిలా ఉండగా.. ఆశ్రమ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులు ఎవరికీ తెలియకుండా బయటకు ఎలా వెళ్తున్నారని, విద్యార్థి దీపక్ మృతికి ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు, విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

చండ్రుగొండ, ఆగస్టు 10: కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో వృద్ధురాలు చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మద్దుకూరు గ్రామానికి చెందిన బూర్గు వెంకటనర్సమ్మ (60) నరసింహులు దంపతులు ఈ నెల 2న ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీకై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. భర్త నరసింహులు కోలుకొని ఇంటికి రాగ, భార్య వెంకటనర్సమ్మ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వేధింపుల కేసు నమోదు

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 10: ప్రేమ పేరుతో ఓ యువకుడు బాలికను వేధింపులకు గురిచేస్తుండడంతో శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివరామకృష్ణ తెలిపారు. మండలంలోని ఓ గ్రామాని కి చెందిన బాలికను 18ఏళ్ళ యువకుడు కొంత కాలంగా ప్రేమిస్తున్నానని వెంటపడి వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్ళగా వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాలిక అదృశ్యం

పాల్వంచ రూరల్, ఆగస్టు 10: మేకలు మేపుకునేందుకు అడవికి వెళ్లిన బాలిక అదృశ్యమైన ఘటన మండలంలోని ఉల్వనూరులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మం డలానికి చెందిన ఓ బాలిక మేకలు మేపుకునేందకు ప్రతిరోజు లాగే ఉల్వనూరు గ్రామ శివారుకు వెళ్లింది. సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు, గ్రామస్తులు, పోలీసులు గాలింపు చేపట్టినా ఆచూకి లభించలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు పోలీసులు తెలిపారు.

నాటు సారా పట్టివేత

పినపాక , ఆగస్టు 10: మండలంలోని దుగినేపల్లి గ్రామ సమీపంలో శనివారం ఎక్సైజ్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో 5 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. మణుగూరు ఎక్సైజ్ సీఐ రాజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దుగినేపల్లి సమీపంలోని ప్రధాన రహదారిపై తనిఖీలు నిర్వహిస్తుండగా దుగినేపల్లికి చెందిన అజ్మీర లక్ష్మయ్య తన ద్విచక్రవాహనంపై ఐదు లీటర్ల నాటుసారా తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ సిబ్బంది ప్రసన్న కుమార్, జ్యోతి, అమల పాల్గొన్నారు.

విద్యార్థిపై దాడి ఘటనపై విచారణ

విచారణ చేస్తున్న ఆర్‌సీవో అంజలి

సారపాక, ఆగస్టు 10: బూర్గంపహాడ్ మండలం లక్ష్మీపురం బీసీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థి దండుగుల సాయికిరణ్‌పై జరిగిన దాడి జిల్లా గురుకుల ఆర్‌సీవో అంజలి శనివారం విచారణ చేపట్టారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బందిని, విద్యార్థి తల్లి యాదమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరభద్రం, జిల్లా ఉపాధ్యక్షుడు భూపేందర్, సందీప్, రవికుమార్ సమక్షంలో విచారణ చేపట్టారు. గాయపడిన విద్యార్థికి వైద్యఖర్చులను గురుకులం యాజమాన్యం భరిస్తుందని హామీ ఇచ్చారు. ఇలాంటి ఘటనలు మరోమారు పునరావృతమైతే కఠిన చర్యలు ఉంటాయని ప్రిన్సిపాల్, సిబ్బందిని హెచ్చరించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు ఆర్‌సీవో తెలిపారు. విచారణలో డీసీవో బ్యూలారాణి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డిప్యూటీ వార్డెన్ చైతన్య, అధ్యాపక, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతి పత్రాలు అందించాలి

మణుగూరు టౌన్, ఆగస్టు 10: మణుగూరు ఏరియా కేపీయూజీ మైన్‌లో పెండింగ్‌లో ఉన్న 2023 సంవత్సరం బదిలీ కార్మికులకు చెందిన జనరల్ మజ్దూర్ ఆర్డర్లను యాజమాన్యం వెంటనే విడుదల చేయాలని ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. 2024 ప్రారంభంలో అందాల్సిన జనరల్ మజ్దూర్ ఆర్డర్‌లు నేటికి అందకపోవడంతో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. కేపీయూజీ మైన్ అధికారుల నిర్లక్ష్యం వెల్ఫేర్ ఆఫీసర్ లేకపోవడం వల్ల 11 మంది కార్మికులకు రెగ్యులరైజేషన్ కాపీలు నేటికి అందక ఎదురు చూస్తున్నారని తెలిపారు. సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పదోన్నతులు ఎక్కడ విధులు నిర్వహిస్తున్న వారికి అక్కడే పోస్టింగ్ ఆర్డర్లు అందించి కార్మికులు ఆర్థికంగా నష్టపోకుండా చూడాలని కోరారు.

పాఠశాలకు బెంచీలు వితరణ

దమ్మపేట, ఆగస్టు 10: మండలంలోని దురదపాడు గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు మం త్రి తుమ్మల మనవడు వల్లభనేని హితేష్ శనివారం రూ.లక్ష విలువైన బెంచీలను అందజేశాడు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రావెల్లి రమేష్, కాసాని ప్రసాద్, కొయ్యల అచ్యుతరావు, వసంతరావు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మావోయిస్టు పార్టీ క్షమాపణ

మావోయిస్టు పార్టీ విడుదల చేసిన లేఖ

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 10: భద్రతా దళాలే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతిచెందిన విషయమై ఆ పార్టీ మృతుల కుటుంబాలను క్షమాపణ కోరుతూ విడుదల చేసి లేఖలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ముద్వెండీలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి పదేళ్ల బాలుడు హిడ్మా కవాసి మృతిచెందిన విషయం విదితమే. అంతేకాక అదే జిల్లాలోని కవద్‌గావ్‌లో సైతం మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి గాధియా కుంజం అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ రెండు ఘటనలకు మావోయిస్టు పార్టీ బాధ్యత వహిస్తూ క్షమాపణలు కోరింది. ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్లు, అమాయకులను జైలుకు పంపడం, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నదని లేఖలో ఆరోపించింది.

ఎన్‌కౌంటర్ మృతులకు మావోయిస్టు పార్టీ నివాళి

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 10: సరిహద్దు మహారాష్ట్రలోని గడ్చిరోలి చింద్‌భట్టీ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన 12 మంది మావోయిస్టులకు నివాళులర్పిస్తూ మావోయిస్టు పార్టీ వెస్ట్ సబ్ జోనల్ కమిటీ బ్యూరో శ్రీనివాస్ పేరుతో శనివారం లేఖ విడుదలైంది. గడ్చిరోలి జిల్లా ఝరావెండి పోలీస్‌స్టేషన్ పరిధి చింద్‌భట్టీ అటవీ ప్రాంతంలో గత నెల 17న సీ–60 భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతిచెందిన విషయం విదితమే. మృతుల్లో నార్త్ గడ్చిరోలి డివిజన్ కమిటీ కార్యదర్శి విశాల్ అలియాస్ సర్దు ఆత్రం, ఆ కమిటీ సభ్యుడు యోగేశ్ అలియాస్ నరేంగ్ తులవి, తిపగఢ్ ఏరియా కమిటీ సభ్యుడు ప్రమోద్ అలియాస్ దల్పత్ కచ్లం, కసన్సూర్ ఏరియా కమిటీ సభ్యులు సరిత అలియాస్ మినీ, రాజే అలియాస్ సిరోంతి గావ్‌డే, మహారు అలియాస్ దోబీ గావ్‌డే, విజ్జు అలియాస్ లచ్చు పార్స, తిపాగఢ్ ఏరియా కమిటీ సభ్యుడు అనిల్ అలియాస్ దేవారి దరే, చందా అలియాస్ సోంబారి పోడియం, సాగర్ అసోం, కసన్సూర్ ఏరియా పార్టీ సభ్యురాలు రోజా అలియాస్ జిమో తామో, పార్టీ సభ్యుడు, డివిజన్ కమిటీ కార్యదర్శి సీతా అవకేం ఉన్నట్లు వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రక్త దాహానికి తమ పార్టీ సభ్యులు బలయ్యారంటూ, మృతి చెందిన అమరవీరులకు నివాళులర్పిస్తూ లేఖ విడుదల చేశారు.

ఆదివాసీ దినోత్సవం విజయవంతం పట్ల కృతజ్ఞతలు

ఐటీడీఏ పీవో రాహుల్

బూర్గంపహాడ్, ఆగస్టు 10: ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా, మండల, గ్రామీణ ప్రాంతాల్లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పండుగలా నిర్వహించి విజయవంతం కావడంపై ఐటీడీఏ పీవో బీ రాహుల్ శనివారం ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయడానికి నియమించిన ఐటీడీఏ అధికారులు, ఆదివాసీ గిరిజన ఐక్యకార్యాచరణ కమిటీ సభ్యులు, తక్కువ సమయంలోనైనా వారికి అప్పగించిన పనులను బాధ్యతగా నిర్వహించారని కొనియాడారు. ఇదే ఉత్సాహంతో ఆదివాసీల ఐక్యతకు ముందడుగు వేయాలని ఆయన కోరారు.

సీతారామ కెనాల్ నీటిపై అపోహలు వద్దు: ఎమ్మెల్యే రాందాస్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

జూలూరుపాడు, ఆగస్టు 10: సీతారామ కెనాల్ ప్రాజెక్ట్ నీటిపై అపోహలు వద్దని వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అఖిలపక్ష నాయకులు రైతులను తప్పుదోవ పట్టించేలా కెనాల్ నిర్మాణంపై ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. వైరాలో ఈ నెల 15న జరిగే సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పోట్ల నాగేశ్వరరావు, బొర్రా రాజశేఖర్, లేళ్ల వెంకటరెడ్డి, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మంగీలాల్ తదితరులు ఉన్నారు.

ఓదెమ్మ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం..

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఓదెమ్మ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఐ కౌన్సిలర్లు

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 10: అవగాహన లోపంతో దోమల మందుతాగి మృత్యువాత పడిన మున్సిపల్ పారిశుధ్య కార్మికురాలు బత్తుల ఓదెమ్మ (50) కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హైదరాబాద్‌లో ఉన్న కూనంనేని, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా ఓదెమ్మ మృతివార్త తెలుసుకొని విచారం వ్యక్తం చేశారు. ఓదెమ్మ మృతికి సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. మహిళా కార్మికురాలు మృతిచెందడం బాధాకరమని, ఆమె కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. తక్షణ సహాయంగా మున్సిపల్ నిధుల నుంచి రూ.3 లక్షల పరిహారం, కర్మకాండలకు రూ.10 వేలు వెంటనే అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు ఇప్పటికే సంబంధిత అధికారులతో మాట్లాడానని పేర్కొన్నారు. కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, ధర్మారావు, యూసఫ్, బోయిన విజయ్‌కుమార్, పి.సత్యనారాయణ చారీ, గెద్దాడు నగేష్, మునిగడప వెంకటేశ్వర్లు, రత్నకుమారి, మాచర్ల శ్రీనివాస్, పిడుగు శ్రీనివాస్, షమీమ్ సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

కార్మికురాలి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 10: మున్సిపాలిటీలోని 8వ వార్డులో పనిచేస్తున్న పారిశుధ్య కాంట్రాక్టు కార్మికురాలు బత్తుల ఓదెమ్మ మృతికి మున్సిపల్ అధికారులే కారణమని, వారిపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్, సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్ జలాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం అఖిలపక్షం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రి లోని మార్చురీ వద్ద నిరసన తెలిపారు. బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాయి, మృతురాలి కుమార్తెలు సరోజ, నాగలక్ష్మి, ఉషా, కుటుంబ సభ్యులు ఉన్నారు.

పనులు పూర్తి కాకుండానే ప్రారంభోత్సవానికి హడావుడా..

రైతులతో కలిసి పనులను పరిశీలిస్తున్న ఐలయ్య

జూలూరుపాడు, ఆగస్టు 10: సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణ పనులు పూర్తి కాకుండానే హడావుడిగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా సీతారామ ప్రాజెక్ట్‌ను ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేయడం విడ్డూరంగా ఉందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని ఐలయ్య విమర్శించారు. ఆయన శనివారం రైతులతో కలిసి అసంపూర్తిగా ఉన్న తారామ ప్రాజెక్ట్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. గిరిజన రైతులు అధికంగా ఉన్న ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు ఇవ్వకుండా సీతారామ ప్రాజెక్ట్ డిజైన్ మార్చి లింక్ కెనాల్ ద్వారా నీటిని తరలించుకుపోవడం సరైంది కాదన్నారు. భవిష్యత్‌లో ఈ ప్రాంత రైతులతో కలిసి ప్రభుత్వ నిరంకుశ నిర్ణయాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏలమంచి వంశీకృష్ణ, అన్నవరపు సత్యనారాయణ, కొండబోయిన వెంకటేశ్వర్లు, వల్లమల చందర్‌రావు, బానోత్ మధు, కనకరత్నం, ఈశ్వర్, బిచ్చు, గార్లపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్స్‌కు సన్మానం


స్టాఫ్‌నర్సు సమ్మక్కను సన్మానిస్తున్న 108 సిబ్బంది

అళ్ళపల్లి, ఆగస్టు 10: స్థానిక పీహెచ్‌సీలో 13 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్స్ సమ్మక్కకు 108 సిబ్బంది శనివారం శాలువతో సన్మానించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి అందిరి మన్ననలు పొందారని, బదిలీపై వెళ్లడం బాధాకరంగా ఉందని అన్నారు. 108 సిబ్బంది సునీల్, శ్రీ హర్ష(బబ్లు), ఈఎంటీ. భాగ్యమ్మ, ప్రేమలత పాల్గొన్నారు.

పీజీ ఎంట్రన్స్ ఫలితాల్లో ప్రవళికకు 20వ ర్యాంక్

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 10: పీజీ ఎంట్రన్స్ పరీక్షా ఫలితాల్లో అశ్వారావుపేట వీకేడీవీఎస్ రాజు కళాశాలకు చెందిన ప్రవళిక ర్యాంక్ సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ వెలుగోటి శేషుబాబు శనివారం తెలిపారు. కళాశాలకు ర్యాంక్ రావడం పట్ల ఆనందంగా ఉందని, ప్రవళికను ప్రిన్సిపాల్ అభినందించారు.

భగత్‌సింగ్ నగర్‌లో వైద్యశిబిరం

మణుగూరు టౌన్, ఆగస్టు 10: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మున్సిపాలిటీలోని భగత్‌సింగ్ నగర్, కాళీమాత ఏరియా, వడ్డెర బజార్ ఆరోగ్య కేంద్రాల్లో శనివారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో రాం ప్రసాద్, రామలక్ష్మికుమారి, మనీషా, నాగమణి, రవి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

భద్రాచలంలో హోమియో వైద్యశిబిరం

బూర్గంపహాడ్, ఆగస్టు 10: భద్రాచలం పెన్షనర్ల సంఘ భవనంలో ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యాధికారి బీ వెంకటేశ్వరరావు శనివారం హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. వయో వృద్ధులు, పెన్షనర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మహేష్‌గౌడ్, ఫార్మాసిస్ట్ రత్నావళి, విజయ్‌కుమార్, సంఘ బాధ్యులు భూషణ్‌రావు, తులసీదాస్, హనుమంతరావు పాల్గొన్నారు.

దిబ్బగూడెంలో..

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 10: మండలంలోని మల్లాయిగూడెం గ్రామపంచాయతీ దిబ్బగూడెంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు లేవని, సాధారణ జ్వరాలు ఉన్నాయని వైద్య పర్యవేక్షణాధికారి వెంకటేశ్వరావు తెలిపారు. విజయకుమారి, ఆశలు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అన్నపురెడ్డిపల్లి, అగస్టు 10: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ప్రియాంక అన్నారు. శనివారం మండలంలోని మైబూబ్‌నగర్‌లో వైద్య సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించి సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

చండ్రుగొండ, ఆగస్టు 10: గ్రామాల్లో ఎవరికివారు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మెడికల్ ఆఫీసర్ కనకం తనూజ అన్నారు. శనివారం రేపల్లెవాడలో వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం ఇంటింటికెళ్లి మురుగు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

దమ్మపేట, ఆగస్టు 10: బడ్జెట్‌లో సామాన్యులపై రూ.30 వేల కోట్ల భారం వేసి కార్పొరేట్లకు రూ.29 వేల కోట్లు రాయితీ ఇవ్వడాన్ని నిరసిస్తూ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ అనుబంధ సంఘాల నాయకులు శనివారం దమ్మపేటలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో గోకినేపల్లి ప్రభాకర్, కురసం ముత్యాలరావు పాల్గొన్నారు.

సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడిగా శివనాయక్

టేకులపల్లి, ఆగస్టు 10: సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడిగా మండలానికి చెందిన మాలోత్ శివనాయక్ ఎంపికైనట్టు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో శివనాయక్ మాట్లాడుతూ.. నా మీద విశ్వాసంతో బాధ్యతలు ఇచ్చిన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్‌నాయక్‌కు, రాష్ట్ర కన్వీనర్ మాలోత్ సైదానాయక్, బానోత్ హుస్సేన్ నాయక్, బానోత్ కిషన్‌నాయక్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిసారు. మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనునాయక్


నియామక పత్రాన్ని అందుకుంటున్న బదావత్ శ్రీను నాయక్

పాల్వంచ రూరల్, ఆగస్టు 10: సేవాలాల్ సేన యువసేన రాష్ట్ర అధ్యక్షుడిగా మండలంలోని తోగ్గూడెం గ్రామానికి చెందిన బదావత్ శ్రీను నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోత్ రాంబాబు నాయక్, త్రిసభ్య కమిటీ చైర్మన్ ప్రేమ్‌చంద్‌నాయక్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నబాబు నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, ప్రధాన పూజారి బోజు మహారాజ్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన కలెక్టర్

హైకోర్టు జడ్జిని కలిసి పూలకుండీని అందిస్తున్న కలెక్టర్ జితేష్ వీ పాటిల్

సారపాక, ఆగస్టు 10: సారపాక ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు వచ్చిన భద్రాచలానికి చెందిన హైకోర్టు జడ్జి బీమపాక నగేశ్‌ను కలెక్టర్ జితేష్ వి పాటిల్ శనివారం కలిశారు. ఈ సందర్భంగా హైకోర్టు జడ్జికి ఆయన పూలకుండీని అందించి పలు అంశాలపై చర్చించారు.

భద్రాద్రి రామయ్యకు స్వర్ణతులసి పూజలు

బూర్గంపహాడ్, ఆగస్టు 10: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తులకు శనివారం అర్చకులు స్వర్ణతులసి పూజలు జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు చేశారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణమూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

అన్నదానానికి రూ.లక్ష వితరణ

ఆలయ అధికారులకు రూ.లక్ష చెక్కును అందజేస్తున్న దాతలు

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి నల్గొండ జిల్లా మిర్యాలగూడేనికి చెందిన సత్యనారాయణ, సూర్యకుమారి దంపతులు శనివారం ఆలయ అధికారులకు రూ.లక్ష వితరణ చేశారు. దాతలకు అర్చకులు పూజలు నిర్వహించి రామయ్య ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ రివరైడ్జ్ సేవలు అభినందనీయం

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

బూర్గంపహాడ్, ఆగస్టు 10: రోటరీక్లబ్ ఆఫ్ భద్రాచలం రివరైడ్జ్ సేవలు అభినందనీయమని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. శనివారం పట్టణంలోని కూనవరం రోడ్‌లోగల అన్నపూర్ణ ఫంక్షన్‌హాల్‌లో రోటరీక్లబ్ ఆఫ్ రివరైడ్ భద్రాచలం 4వ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. అనంతరం క్లబ్ 3150 తెలుగు రాష్ట్రాల తాజా మాజీ గవర్నర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్లబ్‌లు నిరుపేద ప్రజలకు సేవలందించాలన్నారు. రోటరీక్లబ్ ఆఫ్ రివరైడ్జ్ భద్రాచలం క్లబ్ అధ్యక్షుడిగా మడిపెద్ది రమేశ్‌బాబు, కార్యదర్శిగా రొటేరియన్ గంజి సంపత్, ట్రెజరర్‌గా ధనకొండ రాఘవయ్యతో బూసిరెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ గవర్నర్ సాంబశివరావు, అసిస్టెంట్ గవర్నర్ పీ భూషన్‌రావు, వైద్యులు దేవరాజ్, విజయరావు, రామకృష్ణ, రమేష్, హనుమంతరావు, రాజు రమేష్ పాల్గొన్నారు.

సివిల్ ఇంజినీరింగ్ అధికారులతో రివ్యూ మీటింగ్

మాట్లాడుతున్న జీఎం సివిల్ సూర్యనారాయణ

కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 10: సింగరేణి సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ రివ్యూ మీటింగ్‌ను జీఎం సివిల్ సూర్యనారాయణ నిర్వహించారు. 12 ఏరియాల సివిల్ డిపార్ట్‌మెంట్ అధిపతులు, అధికారులు, సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని ఏరియాల్లో నిర్మాణంలో ఉన్న సివిల్ పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన ప్రణాళికలను త్వరగా సిద్ధం చేసి వాటి అమలుకు కృషి చేయాలన్నారు. సివిల్ అధికారులు, సివిల్ క్వాలిటీ కంట్రోల్ సెల్‌కు సంబంధించిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సివిల్ పనులను త్వరగా పూర్తి చేయాలి

రామవరం, ఆగస్టు 10: త్రీ ఇంక్లైన్, రెస్క్యూ స్టేషన్ వద్ద నిర్మిస్తున్న జీఎం కార్యాలయం, ఏరియా వర్క్‌షాప్‌లలో జరుగుతున్న సివిల్ పనులను ఏరియా జీఎం శాలెం రాజు శనివారం పరిశీలించారు. సివిల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం జీవీ కోటిరెడ్డి, ఏజీఎం సివిల్ రామకృష్ణ, అధికారులు శ్రీకాంత్, అనీల్, శంకర్, ఎం.మురళి, శేషశ్రీ, శ్రీనివాసరావు, సివిల్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు, పీఆర్‌సీ ప్రకటించాలి

ఇల్లెందు రూరల్, ఆగస్టు 10: ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏలు, పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జయరాజు అన్నారు. శనివారం స్థానిక జెబిఎస్ ప్రాథమిక పాఠశాలలో ఐక్య ఉపాధ్యాయ ప్రదర్శన యూటీఎఫ్ 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఏ రాంబాబు, కే అన్నపూర్ణ, శేషగిరి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ రేటింగ్‌లో నచ్చికేత్ ప్రతిభ

పాల్వంచ, ఆగస్టు 10: గత నెల 12,13,14 తేదీల్లో విజయవాడలో జరిగిన అంతర్జాతీయ ఫీడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో కేటీపీఎస్ సీ కాలనీకి చెందిన స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షుడు చిలకబత్తిని వీరయ్య, ధనలక్ష్మీ (7వ దశ ఏడీఈ)ల చిన్న కుమారుడు రామ్ నచ్చికేత్ ప్రతిభ కనబరిచాడు. ఆగస్టులో ప్రకటించిన ఫీడే చెస్ రేటింగ్‌లో 1503 రేటింగ్ సాధించి సత్తా చాటాడు. నచ్చికేత్‌ను స్వేరో చైర్మన్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, స్వేరో కన్వీనర్ దుర్గయ్య, ప్రిన్సిపాల్ ఎంవీ రెడ్డి, ఉపాధ్యాయులు, పీఈటీలు, కోచ్ అన్వర్ అభినందించారు.

कॅनरा बैंक భారత సర్కార్ का उपक्रम
కెనరా బ్యాంక్ (భారత ప్రభుత్వ రంగ సంస్థ)
सिंडिकेट Syndicate
రికవరీ సెక్షన్, రీజినల్ ఆఫీస్, హైదరాబాద్ నార్త్, ఫోన్: 9440492936, ఇ-మెయిల్ ఐడి: recrohyd@canarabank.com.

ఇ–వేలం–అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కోసం ఇ–వేలం అమ్మకం ప్రకటన. సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/చార్జ్ చేయబడిన దిగువ తెలిపిన స్థిరాస్తులు కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకోబడినవి, రుణగ్రహీత మరియు హామీదారు మరియు GPA హోల్డర్ నుండి కెనరా బ్యాంక్‌కు బకాయిలు రాబట్టుకొనుటకు "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే విధంగా" 28-08-2024న విక్రయించబడతాయని ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు), సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఇ–వేలం తేది & సమయం: 28-08-2024, ఉ॥ 11.30 గం. నుండి మ॥ 12.30 గం.
(అమ్మకం ముగిసే వరకు ప్రతిసారి 5 నిమిషాల కాలవ్యవధితో అపరిమిత పొడిగింపుతో)
బయానా దాఖలుకు ఆఖరి తేదీ: 26-08-2024, సా॥ 5.00 గం.

1 శాఖ కార్యాలయం: అమీర్‌పేట్ II శాఖ, హైదరాబాద్: రుణగ్రహీత(లు)/సహ–రుణగ్రహీత(లు)/హామీదారు(లు) పేరు మరియు చిరునామా: 1) M/s. S9 సిలీస్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ (రుణగ్రహీత), ప్రాతినిధ్యం వహించు దాని డైరెక్టర్లు శ్రీ జీవన్ కుమార్ మునిపల్లి మరియు కుమారి నందిని సిమ్హాద్రి, ఇం.నెం. 6-3-865/12, గ్రీన్‌ల్యాండ్ అపార్ట్‌మెంట్స్, అమీర్‌పేట్, హైదరాబాద్–500 016. 2) శ్రీ జీవన్ కుమార్ మునిపల్లి (డైరెక్టర్ & హామీదారు), తండ్రి: జీవన్ కేశవ, 14-20-677/231, వివేకానంద నగర్, వివేకానంద విగ్రహం దగ్గర, అల్లాపూర్, బాలానగర్, హైదరాబాద్–500 018, 3) కుమారి నందిని సిమ్హాద్రి (డైరెక్టర్ & హామీదారు), C/o. S. కుమార్ స్వామి, ఫ్లాట్ నెం. 001, గ్రీన్‌ల్యాండ్ అపార్ట్‌మెంట్స్, RBI బ్యాంక్ లేన్, గ్రీన్ పార్క్ హోటల్ దగ్గర, అమీర్‌పేట్, సికింద్రాబాద్, హైదరాబాద్–500 016. మొత్తం బకాయిలు 31-05-2024 నాటికి: రూ. 1,22,63,266/- (కోటి ఇరవై రెండు లక్షల అరవై మూడు వేల రెండు వందల అరవై ఆరు రూపాయలు మాత్రమే) ప్లస్ 01-06-2024 నుండి లెక్కించని వడ్డీ మరియు బ్యాంక్ చార్జీలు.

స్థిరాస్తి వివరాలు మరియు పూర్తి వివరణ

తెలంగాణ రాష్ట్రం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ మండలం, మున్సిపల్ లిమిట్స్ పరిధిలో పాల్వంచ, కాంట్రాక్టర్స్ కాలనీ వద్దగల 1090 చ.అడుగుల RCC భవనం ప్లింత్ ఏరియా, 266.66 చ.గజాల విస్తీర్ణపు స్థలంలో నిర్మించిన పాత ఇం.నెం. 20-15/1, కొత్త ఇం.నెం. 20-5-50కి సంబంధించిన RCC నివాస భవనం మరియు సరిహద్దులు: ఉత్తరం: 30'-0'' వెడల్పు మున్సిపల్ రోడ్స్, దక్షిణం: సత్యనారాయణ ఇల్లు, తూర్పు: గుర్రం శంకరయ్య ఇల్లు, పడమర: 30'-0'' వెడల్పు మున్సిపల్ రోడ్.

రిజర్వు ధర: రూ.40,93,000/- బయానా: రూ.4,09,300/- బిడ్ గుణకాలు: రూ.50,000/-

రిజర్వు ధరలో 10% బయానా మొత్తాన్ని అధీకృత అధికారి, కెనరా బ్యాంక్, అమీర్‌పేట్–II, హైదరాబాద్ పేరున డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించాలి లేదా కెనరా బ్యాంక్, అమీర్‌పేట్–II, హైదరాబాద్ శాఖ, A/c. No. 209272434, IFSC కోడ్: CNRB0013039 ఖాతా జమకు RTGS/NEFT/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా 26-08-2024న సా॥ 5.00 గం. వరకు లేదా ఆలోగా డిపాజిట్ చేయాలి.
*బ్యాంకుకు తెలిసిన తాకట్టు రుణభారాలు లేవు.
ముందస్తు అపాయింట్‌మెంట్‌తో 25-08-2024న ఉ॥ 11.00 గం. నుండి మ॥ 3.00 గం. మధ్య ఆస్తిని తనిఖీ చేసుకోవచ్చును.
అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ (www.canarabank.com)లో ఏర్పాటు చేసిన "ఇ–ఆక్షన్" లింక్‌ను రిఫర్ చేయండి లేదా చీఫ్ మేనేజర్, శ్రీ రజనీష్ రావత్, అమీర్‌పేట్–II, హైదరాబాద్ శాఖ, కెనరా బ్యాంక్, ఫోన్ నెం: 040-23416796, 23416798, మొబైల్: 9440905029 వారిని ఏదైనా పనిరోజున కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చును.
తేది: 03-08-2024, ప్రదేశం: హైదరాబాద్ సం/– అధీకృత అధికారి, కెనరా బ్యాంక్.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616